ప్రజాశక్తి

ఆదివారం 1 జనవరి 2023

5

అల్లూరి సీతారామరాజు




నేటి నుంచి ఉచిత రేషన్ బియ్యం

- జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

ప్రజాశక్తి -పాడేరు : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం కిలో రూపాయికి సరఫరా చేస్తున్న బియ్యం జనవరి నెల నుండి పూర్తి ఉచితంగా సరఫరా చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందనిసంయుక్త కలెక్టర్ జె. శివ శ్రీనివాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుండి ఈ పథకం అమలులోకి వచ్చినందున గ్రామాలలో ఎండియూ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యానికి కార్డుదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించనవసరం లేదని జేసీ స్పష్టం చేశారు. బియ్యంతో పాటు సరఫరా చేస్తున్న కందిపప్పు, పంచదార మాత్రం యథావిధిగా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. ఉచితంగా సరఫరా చేస్తున్న ఈ బియ్యాన్ని కార్డుదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని జేసీ సూచించారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

డిఎంహెచ్ఓ డాక్టర్ జమాల్ బాషా



పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీలో సూచనలు చేస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ జమాల్ బాషా

ప్రజాశక్తి -జి.మాడుగుల : ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యసేవల్లో నిర్లక్ష్యం చూపకుండా వారిని సంతృప్తిపరిచేలా సేవలు అందించాలని డిఎంహెచ్ఓ డాక్టర్ జమాల్ భాషా అన్నారు. శనివారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించారు. ముందుగా నాడు - నేడు నిధులతో చేపట్టిన పిహెచ్‌సి భవన పనులను పరిశీలించారు. వార్డులను తనిఖీ చేసి, రోగుల సౌకర్యార్థం తక్షణమే బెడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పిహెచ్‌సి, వార్డు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బర్త్ వెయిటింగ్ హోమ్‌ను పరిశీలించి, డెలివరీకి వచ్చిన గర్భిణులు వారి సహాయ బంధువులతో ముచ్చటించారు. బాలింతలు ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. మాతాశిశు మరణాలు అరికట్టాలంటే ఆసుపత్రి ప్రసవాలే మార్గమని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు పిహెచ్‌సిలో మందులు, వ్యాక్సిన్ నిల్వలపై ఆరా తీశారు రికార్డులను పరిశీలించారు.నాలుగో విడత కోవిడ్‌ముప్పు పొంచిఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యాక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ శేషాధర్, జిల్లా టీబీ పర్యవేక్షకులు వి కిరణ్ పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి- పాడేరు : నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకాంక్షించారు. ప్రజలకు, అధికార, అనధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నూతన ఉత్సాహంతో పనిచేసి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పునరంకితం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టరుకు సమస్యలను విన్నవిస్తున్న సిపిఎం నేతలు


ప్రజాశక్తి -అనంతగిరి : మండల పరిషత్ భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ రూతు, టోకూరు సర్పంచ్ మొస్య, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ నాగులుతో కూడిన సిపిఎం బృందం సమస్యలపై వినతిపత్రం అందజేసింది. పెద్దకోట పంచాయతీ రేగులపాలెం, కుడియా, పోకూరు పంచాయతీ చిట్టంపాడు, పెద్దకోట పంచాయతీ గుజ్జోలి ప్రాంతాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదించిన హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని, అనంతగిరి పంచాయతీ పాతకోట ఏకలవ్య పాఠశాలకు భూములు ఇచ్చిన రైతులకు ఆదుకోవాలని. కొండిబ, పెద్దకోట పంచాయతీల పరిధి రోడ్డు సదుపాయాలు కల్పించాలని, స్థానిక జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని, అలాగే ములియగుడ అంగన్వాడీ ఆయా పోస్టును స్థానిక గిరిజనులకు కేటాయించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలకు హామీ ఇచ్చారు.

పరుగుతో ఆరోగ్యం మెరుగు

- జిల్లా పరిశ్రమల అధికారి నవీన్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : నిత్యం పరుగు చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చనిజిల్లా పరిశ్రమల అధికారి నవీన్ కుమార్ అన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పేరూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పాడేరు ఘాట్ రోడ్డు నిర్వహించిన పరుగును జిల్లా పరిశ్రమల అధికారి నవీన్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దష్టి సారించాలని, ఆరోగ్యంతోనే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. పరుగులో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ, నక్కలపుట్టు చెక్‌పోస్టు నుండి గరికబంద పాత చెక్ పోస్టు వరకు సుమారు 26 కిలోమీటర్ల పరుగు చేయాలని నిర్ణయించామని, అయితే తనతో పాటు పాల్గొన్న సిబ్బంది 10 కిలోమీటర్ల వరకు పరుగు చేసి ఆగిపోగా, తాను జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ మాత్రం 26 కిలోమీటర్లను మూడు గంటల్లో పూర్తిచేశామన్నారు. ప్రస్తుతం ట్రయల్ రన్‌గా అగ్నిమాపక శాఖ సిబ్బందితో నిర్వహించిన ఘాట్ రోడ్డు పరుగును భవిష్యత్తులో ఆసక్తి ఉన్న ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మ్యాన్ ఎఎల్. బాలకృష్ణ, ఫైర్‌మెన్ ఎస్. గిరీష్, కె..రాము, హోంగార్డు కె.రాంబాబు పాల్గొన్నారు.

భువికి దిగొచ్చిన మేఘాలు



బూసిపల్లి వద్ద ప్రకృతి అందాలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండల కేంద్రానికి అనుకొని ఉన్న బూసిపల్లి గ్రామంలో ప్రకృతి అందాలు పలువురిని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. కొండల మధ్య భూమికి దిగొచ్చాయా అన్నట్లు ఉన్న మేఘాలు స్థానికులతోపాటు ప్రకృతి ప్రేమికులను మైమరిపింపజేస్తున్నాయి. ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న ఈ ప్రాంతం అందాలు అందరికీ తెలియాలంటే, దీన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాఫీకి గిట్టుబాటు ధర కల్పనలో నిర్లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతు సంఘం, గిరిజన సంఘం



నిరసన వ్యక్తం చేస్తున్న కాఫీ రైతులు

ప్రజాశక్తి -పాడేరు : ఏజెన్సీలో కాఫీ రైతులకు ఐటిడిఎ గిట్టుబాటు ధర కల్పించి కాఫీ కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతు సంఘం, గిరిజన సంఘం డిమాండ్ చేశాయి. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో శనివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో కాఫీ రైతుల సంఘం సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో కాఫీకి మంచి ధర ఉన్నప్పటికీ ఐటీడీఏ మాక్స్ సొసైటీ తక్కువ ధర ప్రకటించడంపై గిరిజన కాఫీ రైతులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకులు పాలికి లక్కు మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్లో కాఫీ రేటు చాలా ఎక్కువ ఉన్నప్పటికీ కేవలం ఏజెన్సీలోని 11మండలాల్లోనే పండిస్తున్న కాఫీకి ఇక్కడ సరైన ధర ఇవ్వడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ కిలో కాఫీ రూ.60లకు కొనుగోలు చేయమంటే, ఐటిడిఎ పిఒ రూ.363 కొనుగోలు చేయాలని లైజన్ వర్కర్ల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారని మండిపడ్డారు.గతేడాది చింతపల్లి జికె వీధి ప్రాంతాల్లో కొనుగోలు చేసిన కాఫీని రూ.60కి పైగానే అమ్ముకుని ఐటిడిఎ లాభాలు గడించినా, గిరిజన కాఫీ రైతులను మోసగించిందన్నారు. 2018 నుంచి కాఫీ రైతులకు ఇవ్వవలసిన ప్రోత్సాహకాల నిధులు ఐటిడిఎ పిఒ పక్క దారి పట్టించారని. ఉపాధి హామీ పనులకు అనుసంధానం చేసేవాని కాఫీ ప్రోత్సాహక నిధులు దుర్వినియోగం చేశారన్నారు. దీనిపైస్థానిక ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యే ఎంపీలు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. గిరిజనులకు పూర్తిగా నష్టం కలిగిస్తున్న పిఒను తక్షణమే బదిలీ చేయాలని కోరారు. పట్టాలిచ్చిన కాఫీ రైతులకు రుణాలు మంజూరు చేయాలని, బకాయి పడ్డ కాఫీ పేమెంట్లు రూ.60 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, రైతులు గెమ్మెల సత్తిబాబు, సింహాచలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

దళారులతో జిసిసి యంత్రాంగం కుమ్మక్కు



మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

ముంచింగిపుట్టు: మండలంలో దళారులు, ప్రైవేటు వ్యాపారస్తులతో జిసిసి సొసైటీ కుమ్మక్కై గిరిజన కాఫీ రైతులను మోసగిస్తోందని గిరిజన సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం ద్వారా గిరి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు సిరగం గాసిందొర మాట్లాడుతూ గిరిజన కాఫీ రైతులకు నష్టం వాటిల్లకుండా గిట్టుబాటు ధర కల్పించి కాఫీని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ జిసిసి సొసైటీకి ఇచ్చిన ఆదేశాలను జిసిసి అధికారులకు గాలికొదిలేసి, దళారులు, వ్యాపారస్తులతో చేతులు కలిపి మోసగిస్తున్నారని మండిపడ్డారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న శనివారపు సంత రోజున మాత్రమే జిసిసి అధికారులు కాఫీ కొనుగోలు చేస్తున్నారే తప్ప, మిగతా రోజులు జిసిసి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులు, ప్రైవేటు వ్యాపారులను గిరిజన కాఫీ రైతులు ఆశ్రయించే పరిస్థితులు కల్పించడం దుర్మార్గమన్నారు. కాఫీ పండించే గిరిజన గ్రామలకు వెళ్లి కొనుగోళ్లు చేయకుండా, జిల్లా కలెక్టర్ ప్రకటించిన, కాఫీ ధరలు రైతులకు తెలియనీయమకుండా అడ్డుగోలుగా కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. గిరిజనసంఘం మండల కార్యదర్శి ఎంఎం.శ్రీను, పాంగి భీమరాజు, సుంకంజీ మాట్లాడుతూ ధర విషయంలో జిసిసి, ఐటిడిఎలు గిరిజన కాఫీరైతులను మోసగిస్తున్నాయని, దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టిసారించి, సమగ్ర విచారణ జరిపి, కాఫీ రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సుచిత్‌రావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వారపుసంతలో దళారుల బెడద నివారించాలి

హుకుంపేట : దళారీ వ్యవస్థను నిర్మూలించి, కాఫీకి గిట్టుబాటు ధర కల్పించి జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని గిరజన కాఫీ రైతులు డిమాండ్ చేశారు. శనివారం వారపు సంతకు కాఫీ గింజలు అమ్మకానికి తెచ్చిన గిరిజన రైతులతో మాట్లాడి, ధరలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన రైతులకు గిట్టుబాటు ధర కల్పించి కాఫీ కొనుగోలు చేయాలన్నారు. వ్యాపారులతో మాట్లాడుతూ, ధర, తూకం విషయంలో గిరిజన రైతులనుమోసపుచ్చితే సహించబోమని హెచ్చరించారు. కాఫీ కొనుగోళ్లపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి గిరిజన కాఫీ రైతులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కాఫీ సిబ్బంది, ఆర్గనైజింగ్ వర్కర్స్ పాల్గొన్నారు.



హుకుంపేటలో కాఫీ కొనుగోలును పరిశీలిస్తున్న నేతలు

నూతన ఒరవడితో ప్రజా పోరాటాలకు సిద్ధం

సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-విఆర్.పురం

సిపిఎం కార్యకర్తలు నూతన ఒరవడితో ప్రజా పోరాటలకు సిద్ధం కావాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రం రేఖపల్లిలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరి జీవితాల్లో ఆనందాలను పంచాలని ఆకాంక్షించారు. సిపిఎం జిల్లా కమిటీ తరపున మండల ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గడిచిన ఏడాదిలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొని సిపిఎం కార్యకర్తలు అవిశ్రాంతంగా శ్రమించారన్నారు. ఇదే ఒరవడితో 2023లో రెట్టింపు ఉత్సాహంతో కార్యకర్తలు పార్టీ బలోపేతానికి విశాల ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తల పట్టుదల, కార్యదక్షతతో చేసే ప్రజాఉద్యమాలే ప్రధానమని తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, మాజీ ఎంపీపీ సున్నం నాగమ్మ, పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్న బాబు, మాజీ ఎంపీటీసీ సున్నం పార్వతి, సర్పంచ్‌లు పూనెం సరోజిని, సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సవరం మారయ్య, ఎంపిటిసిలు పూనెం ప్రదీప్ కుమార్, సిపిఎం నాయకులు సున్నం రంగమ్మ, గూటాల శ్రీనివాసరావు, తోడం రాజు, దారయ్య, రాజేశ్వరి, పోడియం రామ్మూర్తి, కారం సుందరయ్య, పులి ధర్మరాజు, కదల కొండారెడ్డి, వల్ల కృష్ణారెడ్డి, నాల్లారపు ప్రకాష్‌రావు, రాజేశ్వరి, గుండిపూడి లక్ష్మణరావు, ప్రకాష్‌రావు, ఖాదర్, తూర్రం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలం వేములకొండ పంచాయతీ వెట్టిచెలకల యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎంపీపీ బంధం శ్రీదేవి ప్రారంభించారు. ఇందులో 18 జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. ఆటల ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అసాంఘిక కార్యక్రమాల జోలికి పోకుండా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడంపై గ్రామ యూత్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమరం పండు దొర, ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వర్లు, వంశి కుంజం, తున్నూరు సర్పంచ్ భాస్కర్, మండల విద్యాశాఖాధికారి శ్రీకారం సత్యనారాయణ దొర, వైసిపి నాయకులు, కార్యకర్తలు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి శ్రీదేవి

జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం, సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ వినోద్‌బాబు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రక్షణ గోడ లేకపోవడంతో పశువులు సంచరించి, రాత్రివేళల్లో ఇక్కడే తిష్ట వేసి అశుభ్రం చేస్తున్నాయని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల సమయంలో సమీప అటవీ ప్రాంతం నుంచి అడవి పందులు వస్తున్నాయని, ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని విద్యార్థులు, సిబ్బంది ఆందోళన గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆఫీసు, కళాశాల ఆవరణకు ప్రహరీ నిర్మించాలని కోరారు. పశువులు కళాశాల ఆవరణకు రాకుండా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ చర్యలు చేపట్టాలని కోరారు.



జూనియర్ కళాశాల కార్యాలయం ఎదుట తిష్టవేసి ఉన్న పశువులు



పవర్ కెనాల్ గండి పూడ్చివేత పనులు జరుగుతున్న దృశ్యం

శరవేగంగా పవర్ కెనాల్ గండి పూడ్చివేత పనులు

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ గండి మరమ్మతు పనులు శరవేయంగా జరుగుతున్నాయి. డిసెంబర్ 14 అర్ధరాత్రి పవర్ కెనాల్‌కు గండిపడి నీరు వృథాగా పోవడంతో డొంకరాయి, పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన విషయం విధేతమే. సుమారు కోటి 70 లక్షల రూపాయలతో కెనాల్ గండి మరమ్మతు చేపట్టడానికి స్థానిక కాంట్రాక్టులకు పనులు అప్పగించారు. మరమ్మతు పనులు చేపట్టి పది రోజుల దాటింది. పనులు వేగవంతం చేయడానికి మెటీరియల్, యంత్రసామాగ్రి కొరత రాకుండా అందుబాటులో ఉండే విధంగా జెన్‌కో అధికారులు చర్యలు చేపట్టారు. పూడ్చివేత పనులు నాలుగు విభాగాలుగా విభజించి నిరంతరం ఏపీ జెన్కో విద్యుత్ సౌధ చీఫ్ ఇంజనీర్ శేషారెడ్డి, సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు బాబూరావు, జాకీర్ హుస్సేన్, ఏఈ సురేష్ పర్యవేక్షిస్తున్నారు. గ్రావెల్‌తో గండి పూడ్చివేత పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ఆదివారం, సోమవారాల్లో కాంక్రీట్ పనులు చేపట్టనున్నారు. జనవరి మొదటి వారానికి గండి పూర్చివేసి కెనాల్ వినియోగంలో తేవడానికి ఇంజనీర్లు శత విధాల ప్రయత్నిస్తున్నారు.



ట్యాబ్‌లు చూపిస్తున్న విద్యార్థినులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-ఎటపాక

రాష్ట్ర ప్రభుత్వం అందించే బైజూస్ టాబ్‌లను ఎటపాక కేజీబీవీ పాఠశాల 8వ తరగతి విద్యార్థినులకు శనివారం ఎంపీపీ కాకా కామేశ్వరి, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో విఠల్ పాల్, ఎంఈఓ బాలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ టాబ్‌లను ఉన్నత చదువులకు, సబ్జెక్ట్‌లో నైపుణ్యం కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రిన్సిపల్ సత్యవేణి ఆధ్వర్యాన బైజూస్ ట్యాబ్‌లను ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, నైపుణ్యతతో కూడిన విద్యను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి చప్పా చంద్రరాణి, వైసిపి జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్ రాజు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు చిడిపల్లి అప్పారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు, వైసిపి నాయకులు కనిగిరి వీరబాబు, అంకం రవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన జూదరులు, కోడిపుంజులతో పోలీసులు

కోడి పందేల శిబిరంపై దాడి

- ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని గరిమండ గ్రామ శివారులో కోడి పందేల శిబిరంపై ముందస్తు సమాచారం మేరకు పోలీసులు శనివారం దాడి చేసినట్లు మంప ఎస్సై లోకేష్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో సత్యనారాయణ, పడాల్, కంటయ్య అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, నాలుగు కోడి పుంజులు, రూ.310 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. కోడిపందేలు, జూదం ఆడటం నేరమని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని బూదరళ్ళ పంచాయితీ, పోకలపాలెం గ్రామంలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు చుట్టుపక్కల గ్రామస్తులు హాజరయ్యారు. పాస్టర్ ప్రార్థనలు చేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొయ్యూరుకు చెందిన ఎంవివి అశోక్, మాకాడ బూర్గులయ్య వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూదరాళ్ళ వార్డు మెంబర్ సాగిన సంజీవులు, ఉపాధ్యాయులు దొరబాబు, తాంబేల చిట్టిబాబు, పాంగి మోహన్ రావు, పాంగి సంతోష్, తాంబే దాసు, పాంగి సన్యాసిరావు పాల్గొన్నారు.



చీరల పంపిణీ చేస్తున్న దృశ్యం


పెదబయలు విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

గిరి విజ్ఞాన సంబరాల్లో పెదబయలు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పెదబయలు : పాడేరులోని తలారిసింగి కేంద్రీకృత ఆశ్రమపాఠశాలలో నిర్వహించిన గిరిజన విజ్ఞాన సంబరాల్లో స్థానిక జిబిడబ్ల్యు బాలుర వసతి గృహం విద్యార్థులు వివిధ ఈవెంట్లలో మంచి ప్రతిభ కనబరిచారని హెచ్ఎం కె.నాగేశ్వరరావు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులలో ఆంగ్లంలో స్పెల్ బీస్‌కు ప్రథమ బహుమతి, సైన్స్ విభాగంలో స్మార్ట్ డ్రగ్ డిటెక్టివ్ ఇన్ ట్రైబల్ ఏరియాకు ద్వితీయ బహుమతి, గణిత విభాగంలో ఆల్‌జీబ్రాకు తృతీయ బహుమతి దక్కించిన తెలిపారు. ప్రతిభ కనబరిచిన తమ పాఠశాల విద్యార్థులు అరకు ఎంపీ మాధవి, కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి బహుమతులందుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీనికి కృషి చేసిన ఉపాధ్యాయులు కె.రవికుమార్, ఇతర ఉపాధ్యాయులను అభినందించారు.

హుకుంపేట: గిరి విజ్ఞాన సంబరాలలో స్థానిక జిబిడబ్ల్యు ఇంగ్లీష్ మీడియం-2బాలుర పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి మూడు బహుమతులు పొందారు. గణిత విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమస్థానం,బయోలాజికల్ సైన్స్‌లో జిల్లా స్థాయిలో రెండవ బహుమతి. ఇంగ్లీష్‌లో జిల్లా స్థాయిలో మూడో బహుమతి గెలుపొందారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్స్ రేగం అనిల్‌కుమార్,గుజ్జెలి రవికుమార్, ఒల్లి అర్జున్‌లను హెచ్ఎం ఎస్.నాగభూషణంనాయుడు అభినందించారు.


సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలోని సింగనబంద పంచాయతీ రోలంగిపుట్టు గ్రామంలో రూ.14లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం స్థానిక సర్పంచ్ మసాడి కొండమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సిసిరోడ్డు నిర్మాణ పనుల్లో ఎటువంటి నాణ్యతాలోపం లేకుండా, త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు

విజయమే లక్ష్యంగా పనిచేయాలి : పాడేరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పాడేరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సిఎం జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే దిశగా వైసిపి శ్రేణుల పని చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. కోరారు. శనివారం పాడేరులో గ్రామ సచివాలయ కన్వీనర్, వాలంటీర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు కుటుంబాలకు ఏ ప్రమాదం జరిగినా బీమా ఉంటుందన్నారు. . జగనన్న సైనికులుగా వాలంటీర్లు, కన్వీనర్లు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు ప్రతిపక్ష పార్టీలు చేసే ఆరోపణలను తిప్పికొట్టే స్థాయిలో ముందుండాలని సూచించారు.

ఎట్టకేలకు మండల పరిషత్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి -అనంతగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనం ఎట్టకేలకు 14ఏళ్ల తర్వాత ప్రారంభమైంది. జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎంపిపి శెట్టి నీలవేణి కృషితో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక చొరవ, సహకారంతో ఇన్నాళ్లు పూర్తికాని భవనం ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకుంది. శనివారం స్థానిక సర్పంచ్ సోమెల్లి. రూతు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి, జెడ్‌పిటిసి సమక్షంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక ప్రజాప్రతినిధులు భవననిర్మాణ సమస్యను తన దృష్టికి తెచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసి పూర్తి చేశామన్నారు. భవనానికి అవసరమైన ఫర్నిచర్, కార్యాలయానికి డ్రింకింగ్ వాటర్, ఇతర సౌకర్యాలు కల్పనకు సహకరిస్తానని హామీనిచ్చారు. . జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎంపిపి శెట్టి నీలవేణి మాట్లాడుతూ, తాము కోరిన వెంటనే ప్రత్యేక శ్రద్ధ చూపి మండల పరిషత్ భవన నిర్మాణానికి సహకరించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎండిఓ హర్షిత్ కుమార్ తహశీల్దార్ రాంబాబు. డూమా పీడీ రమేష్, రమణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా ఎంపిటిసిలు డి.జయవర్ధిని తదితర నాయుడు, సర్పంచులు కె. మొస్య, బిడిబ్బ్యాలు వెంకటరమణ హెచ్ఎం బి. మంగ మల్లేశ్వరి పాల్గొన్నారు


భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బొర్రాలో వాహనాల పార్కింగ్ స్థలం ప్రారంభం

ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాలో వాహనాల పార్కింగ్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ జన్ని. అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశ,విదేశాల నుంచి సందర్శనకు వచ్చే పర్యాటకులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. బొర్రా పంచాయతీ ఆదాయంలో పంచాయతీ వాటాతో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. జెడ్‌పిటిసి గంగరాజు, ఎంపిపి నీలవేణి, ఎంపిటిసి అరుణ, పాల్గొన్నారు.

యుటిఎఫ్ సేవలు ప్రశంసనీయం

-డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో డిఇఒ డాక్టర్ రమేష్


పాడేరులో యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - పాడేరు : యుటిఎఫ్ సేవలు ప్రశంసనీయమని డిఇఒ డాక్టర్ పి.రమేష్ అన్నారు. శనివారం పాడేరులో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని తన చాంబర్‌లో యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలకే పరిమితం కాకుండా సామాజిక సమస్యల్లో కూడా యుటిఎఫ్ పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. వరదలు, తుఫానులు, కరోనా లాంటి విపత్తు సమయాలలో కూడా యుటిఎఫ్ పోషించిన పాత్ర శ్లాఘనీయమన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం మోడల్ పేపర్లు రూపొందించి అతి తక్కువ ధరకే అందించడం అభినందనీయమన్నారు. యుటిఎఫ్ రూపొందించిన డైరీ ఉపాధ్యాయులతో పాటు, ఉద్యోగులకు అవసరమైన సమాచారంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం యుటిఎఫ్ ఎప్పుడూ తన వంతు పాత్రను పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.మహేష్, జిల్లా సహ అధ్యక్షుడు సి.హెచ్.నాగేశ్వరరావు కార్యదర్శులు, కె.రఘునాథ్, యం.ధర్మరావు, పి.దేముడు ఐటిడిఎ కోఆర్డినేటర్ యం. బాబురావు ఎస్.కన్నయ్య, యం. రామకృష్ణ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: స్థానిక గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల (బాలికల -1) ఆవరణలో యుటిఎఫ్ 2023 నూతన డైరీలు, క్యాలెండర్లను హెచ్ఎంకె.లక్ష్మి శనివారం ఆవిష్కరించారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, ఉపాధ్యాయులకు డైరీలు, నూతన క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్, జిఒ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మి మాట్లాడుతూ మండల యుటిఎఫ్ కార్యవర్గం నిరంతరం ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యపై కృషి చేస్తూ ముందు వరుసలో ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు, మండల కార్యవర్గ ప్రతినిధులుబలిజ పుండరీ, ఎస్.గోపి, ధనుపతి, సుబ్బారావు, రాజారఘుమణి, బాలికల-1 పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, జగన్నాధస్వామి, పావని, సుమలత పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ధర్మారావు

నేరాలు ఘోరాలు

గిరిజనుడి అదృశ్యం

ప్రజాశకి-పెడబయలు: మండలంలో కుంతుర్ల పంచాయతీకి చెందిన బొర్రా మామిడి గ్రామస్తుడు పూజారి కొండబాబు ఐదు నెలలుగా ఆచూకీ లేదని ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు వివరాలిలా ఉన్నాయి ఈఏడాది జూలై నెలలో తోటి స్నేహితులతో కలసి ఉపాధి కూలి పనులకు విజయవాడ వెళ్లిన కొండబాబు, విజయవాడ రైల్వేస్టేషన్ దిగిన తరువాత కనిపించకుండా పోయాడని, దీనిపై అప్పట్లోనే అతనిపాటు వెళ్లినవారు కుటుంబసభ్యులకు ఫోను ద్వారా సమాచారమిచ్చారన్నారు. ఇన్నాళ్లు గాలించినా కొండబాబు ఆచూకీ దొరకకపోవడంతో కొండబాబు భార్య శాంతి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.కొండబాబు ఆచూకీ తెలిస్తే 94409 04227 సెల్ నంబర్‌కు సమాచారం అందించి సహకరించాలని ఎస్ఐ కోరారు.


గిరిజన, వర్తక సంఘం పట్టుకున్న రేషన్ బియ్యం

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి ముంచింగిపుట్టు: జిసిసి డిపోల ద్వారా గిరిజనులకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.మంచంగిపుట్టు వర్తక సంఘం మండల అధ్యక్షులు సోనియా ప్రసన్నకుమార్, గిరిజన వ్యాపారుల సంఘం నాయకులు రామ్‌చందర్, గోపాల్ శనివారం వారపుసంతలో నిఘా పెట్టి, ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.

వివరాల్లోకి వెళితే శనివారం ముంచంగిపుట్టు వారపుసంత నుండి రూడకోట మీదుగా ఒడిశా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం 26బస్తాల్లోని ఒక్కొక్కటీ 50 కిలోలు బరువైన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. జోలాపుట్ గ్రామానికి చెందిన గిరిజనేతరుడు ప్రభ అనే వ్యాపారి నుంచి స్థానిక గిరిజనులు, గిరిజన వ్యాపారుల సంఘం నాయకులు, వినియోగదారుల సంఘం నాయకులు పట్టుకొని మండల వర్తక సంఘం, వినియోగదారుల ప్రతినిధులకు తెలియపరచగా, వాళ్ల సమక్షంలో తహశీల్దార్ నర్సమ్మకు అప్పగించారు. రెండు వారాల క్రితం వర్తకసంఘం పట్టుకున్న జిసిసి కందిపప్పు విషయంలో కల్లిబొల్లి కబుర్లు చెప్పి తప్పుదోవ పట్టించిన అధికారులు, ఇపుడు పిడిఎస్ బియ్యం విషయంలో ఏం కుంటిసాకులు చెబుతారోనని అంటున్నారు. అధికారులు చేయాల్సిన పనిని ప్రజలు, ప్రజాసంఘాలు చేస్తున్నాయని, పట్టుకున్న తర్వాతైనా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

బొర్రా బాలుర పాఠశాలను సందర్శించిన ఎస్‌టి కమిషన్ సభ్యురాలు

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని బొర్రా బాలుర పాఠశాలను ఎస్‌టి కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి శనివారం సందర్శించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీసిన రామలక్ష్మి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం విద్యార్థులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా అభివృద్ధి చెందాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పాఠశాలలో పరిశుభ్రతపై నిర్లక్ష్యం చేయవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు కె రామసుందర్ పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న సిపిఎం ఎంపిపి లక్ష్మి, నాయకులు సత్యనారాయణ తదితరులు

సిపిఎం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విఆర్.పురం : కొంతకాలంగా అనారోగ్యంతో పాటు మతిస్థిమితం కోల్పోయి చికిత్స పొంది కోలుకొని ఇంటికి చేరిన మండల కేంద్రం రేకపల్లి గొల్లగూడెం ఎస్‌టి కాలనీకి చెందిన కట్టం శ్రీరామ్మూర్తికి సిపిఎం ఆర్థిక సాయం అందించింది. రూ.2వేలు నగదు, పండ్లును ఎంపీపీ కారం లక్ష్మి, రేకపల్లి సర్పంచ్ పూనెం సరోజిని చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, నాయకులు పంకు సత్తిబాబు, సరిహద్దు వెంకన్న, సోల వినోద్, మడకం రాజు, లక్ష్మి పాల్గొన్నారు.

ఎంపిటిసికి శివప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి-కొయ్యూరు : అనారోగ్యంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్న మండలంలోని శరభన్నపాలెం ఎంపీటీసీ లోకుల సోమగాంధీని అరకు ఎంపీ జి.మాధవి భర్త, నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఎటువంటి సమస్య ఉన్న తనకు తెలియజేయాలన్నారు.

ఉక్కును అమ్మే అధికారం మోడీ ప్రభుత్వానికి లేదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒక్కదానినీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, అటువంటప్పుడు ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే అధికారం ఎక్కడిదని సిఐటియు ఆరిలోవ జోన్ కార్యదర్శి నరేంద్ర కుమార్ ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారానికి 639వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఆరిలోవ, మద్దిలపాలెం, మధురవాడ జోన్ సిఐటియు నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నందునే విశాఖపట్నం మహా నగరంగా అభివృద్ధి చెందిందని, లక్షలాది మంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు.

60 అడుగుల వెడల్పుతో మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలోని జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు జంక్షన్ మీదుగా క్వీన్ విక్టోరియా విగ్రహం వరకు ఉన్న రోడ్డును 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని జివిఎంసి తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ రోడ్డు అభివృద్ధిపై అభ్యంతరాలు, సూచనలు కోరుతూ ఈ మధ్య 15 రోజులు గడువును ఇచ్చింది. ఆ గడువు కూడా ముగిసి వారం రోజులు అయింది. పలు అభ్యంతరాలు, సూచనలు వచ్చాయి. ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు డెవలప్‌మెంట్ మేరకు ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. దాదాపు నాలుగేళ్ల క్రితం మెయిన్ రోడ్డు వెడల్పుకు అప్పటి ప్రభుత్వం సన్నాహాలు చేసింది. రోడ్డు విస్తరణలో భవనాలు, వివిధ కట్టడాలు కోల్పోనున్న అనేక మందితో అప్పటి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పలు సమావేశాలు నిర్వహించారు. వంద అడుగుల వెడల్పుతో రోడ్డును అభివృద్ధి చేయాలని భావించారు. తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు రావడంతో 80 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనికి కూడా అభ్యంతరాలు అధికంగా వచ్చాయి. ఈ నేపథ్యంలో 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయాలని ఎక్కువమంది సూచించారు. దీంతో అప్పటిలోనే 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధికి ప్రయత్నించారు. ఏ కారణం చేతనో అది ఆచరణకు నోచుకోలేదు. ఈ పూర్వ రంగంలో మరోసారి 60 అడుగుల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి విస్తరణకు జివిఎంసి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికైనా రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సుగర్ ఫ్యాక్టరీల ఊసేది ?

కార్మికుల బకాయిలపై దక్కని భరోసా
ఉత్తరాంధ్ర సుజల స్రవంతినీ మరిచిన జగన్
నిరాశపరిచిన సిఎం నర్సీపట్నం పర్యటన


శుక్రవారం జరిగిన సభలో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని శుక్రవారం నర్సీపట్నం పర్యటనలో చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడే ప్రధానాంశాలను విస్మరించారు. తాను చెప్పాలనుకున్న విషయాలకు, చేయాలనుకున్న విమర్శలకు ఇచ్చిన ప్రాధాన్యత.. గ్రామీణ ప్రాంత ప్రజల జీవితాలు మెరుగుపడేందుకు దోహదపడే సహకార చక్కెర ఫ్యాక్టరీల ఆధునికీకరణ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనుల పురోగతిపై ఇవ్వలేదు. కనీసంగానైనా మాట్లాడలేదు. మూడు సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డంతో గ్రామీణ ప్రాంతంలో చెరుకు పంట విస్తీర్ణం తగ్గింది. సహకార ఫ్యాక్టరీలను ఆధునికీకరించి క్రషింగ్ పునరుద్ధరిస్తే రైతులకు ఎంతో మేలు జరిగేది. ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిలు చెల్లించలేదు. ఏటికొప్పాక కార్మికులకు రూ.8 కోట్లు, తాండవ ఫ్యాక్టరీ కార్మికులకు రూ.8.50 కోట్లు బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాల్లో పిల్లలను చదివించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కార్మికుల జీతాలు చెల్లింపు విషయం, ఫ్యాక్టరీల ఆధునికీకరణాంశం విషయాలను సిఎం తన సభలో ప్రస్తావించలేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో 8 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనుల విషయాన్నీ విస్మరించడంతో ప్రజలు నిరాశ చెందారు. నర్సీపట్నం ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని అధికార పార్టీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ చేసిన విజ్ఞప్తిపై కూడా సిఎం స్పందించలేదు.

బకాయిలపై హామీ ఇస్తారనుకున్నాం

ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిల చెల్లింపుపై సిఎం హామీ ఇస్తారనుకున్నాం. 18 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పిల్లలను చదివించుకోలేకపోతున్నాం. ఏటికొప్పాకలో 300 మంది కార్మికులకు రూ.8 కోట్లు, తాండవలో 300 మందికిపైగావున్న కార్మికులకు రూ.8.50 కోట్లు చెల్లించాల్సివుంది. రిటైర్‌మెంట్ సదుపాయాలు కార్మికులకు ఇవ్వలేదు. జాబ్‌కార్డుల్లేక ఉపాధి పనులు ఇవ్వడం లేదు. బకాయిలు పూర్తిగా చెల్లించాలి. క్రషింగ్ నిలిపివేసిన కాలంలో ప్రతినెలా సగం జీతం కార్మికులకు చెల్లించాలి.

గుండుబోగుల గోవిందరావు,
ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీ శ్రామిక యూనియన్ ప్రధాన కార్యదర్శి

చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరించాలి

మూతపడ్డ మూడు సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి, క్రషింగ్ పునరుద్ధరణ చర్యలు చేపట్టకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడివుందని సిఎం చెప్పడం ప్రజలను మోసగించడమే. నాలుగు సుగర్ ఫ్యాక్టరీల్లో ఒకటి టిడిపి ప్రభుత్వం, రెండు వైసిపి ప్రభుత్వ కాలంలో మూతపడ్డాయి. జిల్లా అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధివుంటే చక్కెర ఫ్యాక్టరీల క్రషింగ్ పునరుద్ధరించాలి. కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు పూర్తిచేసి సాగునీటి సౌకర్యం కల్పించాలి.

ఎం.అప్పలరాజు,
ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

కెజిహెచ్ సూపరింటెండెంట్‌గా అశోక్ కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్)కు నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి.అశోక్ కుమార్ నియమితులయ్యారు. ఇంతవరకూ ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ పి.మైథేలి శనివారంతో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆమె స్థానంలో గుంటూరు మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ పి.అశోక్ కుమార్‌ను ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డివైఎఫ్ఐ గ్రీటింగ్ కార్డులు, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : డివైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ రూపొందించిన గ్రీటింగ్ కార్డులు, పోస్టర్లను శనివారం జగదాంబ దరి ఎన్‌పిఆర్ భవన్‌లో సంఘం రాష్ట్ర నాయకులు యుఎస్ఎన్.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిందని, వారి మాట ప్రకారం ఇప్పటికే 16 కోట్ల ఉద్యోగాలు ఇచ్చి ఉండాలని, కానీ వాస్తవంలో ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని, ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగ భద్రతతో పాటు రిజర్వేషన్లు కూడా లేకుండా పోతాయని తెలిపారు. ఇది బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్ర అన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరిట యువతను మోసం చేసిందన్నారు. ఈ మధ్యకాలంలో కొన్ని వేల పోస్టులు పోలీసు శాఖలో భర్తీ చేయాల్సి ఉండగా కేవలం ఆరు వేల పోస్టులను మాత్రం తీసి అన్యాయం చేసిందన్నారు. డివైఎఫ్ఐ పోరాటం చేయడంతో వయోపరిమితిని రెండు సంవత్సరాలకు పెంచారని, దీన్ని కనీసం ఐదు సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం కేంద్రంగా డ్రగ్స్ మాఫియా నడుస్తోందని, చిన్నపిల్లలు, విద్యార్థులు, యువకులు బానిసలు అవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని కట్టడి చేయడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పై అంశాలను దృష్టిలో పెట్టుకొని 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం' నినాదంతో గ్రీటింగ్ కార్డులను రూపొందించామన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న ఎంపిపి, ఎంఇఒ

కాకవాడ ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఎంపిపి బంధం శ్రీదేవి, ఎంఇఒ శ్రీకారం సత్యనారాయణ దొర శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని అన్ని తరగతులు గదులకు వెళ్లి విద్యాభ్యాసన ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. 8వ తరగతి పిల్లలకు ఇచ్చిన ట్యాబ్‌లను బాగా చదువుకోవడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం పిల్లల వసతి గదులు పరిశీలించారు. సచివాలయం ఎఎన్ం వారానికి రెండుసార్లు వచ్చి పిల్లలు ఆరోగ్య పరిస్థితి చూడాలని సూచించారు. భోజనం విషయంలో నాణ్యత లేక పోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొమరం పండు దొర, ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వర్లు, వంశి కుంజం, తున్నారు సర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం లేని మనిషి జగన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మానవత్వం లేని మనిషి అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం విశాఖ నగరంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏదైనా దుర్ఘటన జరిగి ఎవరైనా చనిపోతే సానుభూతి చూపుతారన్నారు. కానీ కందుకూరు దుర్ఘటన పట్ల జగన్‌లో సానుభూతి వ్యక్తం కాలేదన్నారు. దీనిపై మోడీ ప్రకటన చేసిన తర్వాత మాత్రమే జగన్ స్పందించారని చెప్పారు. రాయలసీమలో జగన్ కుటుంబం ఎందరినో పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. తన రాజకీయాల కోసం అశువులు బాసిన వారిని జగన్ ఆదుకోలేదన్నారు. ఆ కుటుంబాలను సైతం తమ పార్టీ అధినేత చంద్రబాబు ఆదుకున్నారని గుర్తు చేశారు. జగన్ పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన సభల్లో పలువురు చనిపోయినా వారికి ఒక్క రూపాయి ఇవ్వలేదని తెలిపారు. సొంత బాబాయ్ ఎలా చనిపోయాడో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. బాబాయ్ హత్యతో తనకు ప్రమేయం లేదని, తాను నమ్మిన జీసస్‌పై జగన్ ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు. సొంత తండ్రి చనిపోతే శవం పక్కనే రాజకీయాలు చేసిన చరిత్ర ఆయనదని ఎద్దేవా చేశారు. జగన్ అవగాహనా రాహిత్యం వల్లే గోదావరిలో బోటు ప్రమాదం జరిగి అనేకమంది చనిపోయారన్నారు. ఆయన చరిత్ర హత్యలతో నిండిపోయిందని, అటువంటి వ్యక్తి మానవత్వం గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. నర్సీపట్నం సభలో శవ రాజకీయాల గురించి మాట్లాడటం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల సాగునీటికి అవసరమైన సుజల స్రవంతి ప్రాజెక్టును జగన్ గాలికి వదిలేసారని విమర్శించారు

హేమసుందర్‌కు ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నేమాల హేమసుందర్‌కు దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ అయిన విశాఖ రత్న కళాపరిషత్ డాక్టర్ నందమూరి తారక రామారావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలను విశాఖరత్న కళా పరిషత్, డాక్టర్ నందమూరి తారక రామారావు నాటకోత్సవాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ నగరంలో ఏడాది పాటు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా ప్రతి నెలా కళాకారులచే వివిధ సాంస్కృత కార్యక్రమాల ప్రదర్శనతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి ఎన్‌టిఆర్ స్మారక పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. అందులో భాగంగా ఎనిమిదో నెల కార్యక్రమాన్ని ఉపకార గ్రూపు అధినేత కంచర్ల అచ్యుతరావు సహకారంతో ద్వారకానగర్ పౌర గ్రంథాలయం ఎసి ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు హేమసుందర్‌ను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పి.ఎ.భాస్కరరావు, అతిథులు గోడి నరసింహాచారి, విజయలక్ష్మి దంపతులు, సినీ దర్శకులు దుగ్గివలస దివాకర్, కుమార్ నాయక్, తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.